క్లుప్తంగా

ప్రతి కార్యకర్తకుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది

ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: వైఎస్సార్ సీపీ ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ, తాను ఎప్పుడూ అండగా ఉంటానని, అధైర్యపడవద్దని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాయవరం గ్రామంలో ఇటీవల మృతిచెందిన మాచవరపు హసీనా కుటుంబాన్ని పరామర్శించి ఆయన మాట్లాడారు. పార్టీ అభివృద్ధికి కష్టకాలంలో పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఆ కుటుంబానికి రూ. 20వేల ను ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చామకూరి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ పినపాటి సుందరలీల, ఎంపీటీసీ మట్టా వెంకటేశ్వర్లు, కొమ్ము ఏసుపాదం, పొన్నాల ప్రవీణ్, నాదెండ్ల బాబు, పెండ్లి వెంకట్రామయ్య, పెండ్లి రామ సుబ్బారావు, దొంతగాని వెంకటేశ్వర్లు, జాజుల వెంకటేశ్వర్లు, చామకూర ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

బాధ్యతతో సర్వే చేపట్టాలి



దాచేపల్లి : ఓటర్ల సర్వే నిష్పాక్షపతంగా జరగాలని గురజాల ఆర్డీఓ కె. అద్దయ్య అన్నారు. మండలంలోని మాదినపాడులో జరుగుతున్న ఓటర్ల సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. సర్వే తీరుపట్ల అధికారులు ఆర్డీఓకు వివరించారు. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా సర్వే చేయాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని, మరణించిన వారివి, వలస వెళ్లిన వారి ఓట్లు పరిశీలన చేసి తొలగించాలని ఆర్డీఓ అద్దయ్య చెప్పారు. ఉద్దేశపూర్వకంగా ఓట్లు మార్పులు, చేర్పులు చేస్తే సంబంధిత బీఎల్వోపై చర్యలు తీసుకుంటామని, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పనిచేయాలని ఆయన తెలిపారు. ఆర్డీఓ వెంట డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మం, సర్పంచ్ అనుముల అంజిరెడ్డి, ఎంపీటీసీ నంద్యాల వీరారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, పలు రాజకీయ పార్టీల నేతలు ఉన్నారు.

నేడు వైఎస్సార్ విగ్రహానికి భూమి పూజ

దుర్గి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి శుక్రవారం ఉదయం 10గం''లకు భూమి పూజ చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు కోట రాజు, మాదాసు వాసులు తెలిపారు. కార్యక్రమానికి మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హాజరవుతారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ స్థానిక పంచాయతీ ఆవరణలో విగ్రహావిష్కరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

నరసరావుపేట ఈస్ట్: ఇస్సప్పాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు పట్టణానికి చెందిన గుజె మణిదీప్, భాగ్యలక్ష్మీ దంపతులు రూ.50వేలు ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డికి అందించారు. తమ కుమారుడు సాయివేదాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకొన్న అనంతరం విరాళంను అందించారు. ఈసందర్భంగా ఈఓ సుధాకరరెడ్డి మాట్లాడుతూ, ఈనెల 20వతేదీ ఆదివారం ఉదయం 11.39 గంటలకు అమ్మవారి బాలాలయ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

హైవే వెంబడి మురుగు పారుదలకు పనులు

నాదెండ్ల: చిలకలూరిపేట పట్టణం నుంచి జాతీయ రహదారి వెంబడి కుప్పగంజివాగుకు మురుగునీరు పారుదలకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. కొద్దిపాటి వర్షానికే పట్టణంలోని కొన్ని ప్రాంతాలు జలమయమౌతుండటంతో అధికారులు రెండు రోజులుగా మురుగునీరు పారుదల మెరుగుపర్చేందుకు పనులు ప్రారంభించారు. ఏఎంజీ ఎదురుగా కుప్పగంజివాగు వరకూ పొక్లయినర్‌తో కాలువలకు అడ్డుగా ఉన్న వ్యర్థాలు తొలగిస్తున్నారు. గణపవరం వెళ్లే డొంక రోడ్డుపై మురుగునీరు చేరి స్థానికుల నుండి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో మురుగు పారుదలకు పనులు చేస్తున్నారు. గురువారం ఆయా పనులను మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, అధికారులు పరిశీలించారు.

ఓటర్ల జాబితాలలో అవకతవకలు లేకుండా చర్యలు

చిలకలూరిపేట టౌన్: ఓట్ల నమోదు, ఓటర్ల జాబితాలో అవకతవకలకు తావివ్వకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు చెప్పారు. గురువారం పట్టణ పరిధిలో నాలుగు పోలింగ్ కేంద్రాల పరిధిలో అభ్యంతరాలను స్వీకరించి, ప్రజలతో మాట్లాడారు. ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఓటర్ల జాబితాను, ఇళ్లను పరిశీలించారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి కె.సునీత, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో నిత్యం ప్రతి గడపను తాకి వారి సమస్యను తెలుసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వినూత్నంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 9వ వార్డు సచివాలయాల పరిధిలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కౌన్సిలర్ యర్రాకుల సిద్దమ్మ సిద్ధయ్య, బుట్టు చంద్రల ఆధ్వర్యంలో భాగంగా పీఆర్కే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి గడపనూ ఎమ్మెల్యేలు సందర్శించి నవరత్నాల అమలు తరువాత కూడా మిగిలి ఉన్న సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, అబ్దుల్ జలీల్, బత్తుల ఏడుకొండలు, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు, ప్రజలు 360 గడపలను పీఆర్కే సందర్శించి ప్రతి కుటుంబానికి చేకూరిన ప్రయోజనాన్ని వివరించారు. ఈ సందర్భంగా అయా ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అయన మాట్లాడుతూ నవరత్నాలతో పాటు అదనంగా పలు సంక్షేమ పథకాలు సీఎం జగన్ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఇందుకు విరుద్ధంగా ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న రాజకీయ విమర్శలు పట్టించుకోకుండా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి నిర్దిష్ట విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చల్లా శ్రీనుతో పాటు పలువురు బిసి నాయకులు, పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, అబ్దుల్ జలీల్, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ బూదాల మరియమ్మ, ఆయా వార్డు కౌన్సిలర్లు గట్ల కోటిరెడ్డి, షేక్ దస్తగిరి, పోలా శ్రీను, చంద్ర కుమార్, తేరాల సిద్దయ్య, రామిశెట్టి వెంకటేశ్వర్లు, మందా సంతోష్, ఎస్ శ్రీనివాస్, షేక్ సుభాని, కరిముల్లా, మస్తాన్, రామగాని శంకర్, చందూ గౌడ్, కో ఆప్షన్ మెంబర్‌లు అల్లి జీవన్, అనంతరావమ్మ, యాసిన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కమీషనర్ రమణబాబు, ఎఈ సామేల్ పలువురు నాయకులు పాల్గొన్నారు. వార్డులో ప్రారంభం నుంచి గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసే వరకు వార్డులోని పలువురు మహిళలు, ప్రజలు పిఆర్కేకు జే జేలు పలుకుతూ పూలు చల్లుతూ, హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ప్రజలు భారీ స్థాయిలో పిఆర్కే కౌన్సిలర్లు తేరాల సిద్దయ్య ల ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ పీఆర్కే సత్కారం చేశారు.

పాలవెల్లువను మరింత ముందుకు తీసుకెళ్లాలి



నాదెండ్లలో పశువైద్యులతో మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలోని పశువైద్య కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. పాడి రైతులతో మాట్లాడారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని వేగంగా పాడి రైతులకు చేరవేయాలని ఆదేశించారు. పాడి రైతులకు వైద్య సిబ్బంది చేస్తున్న సేవలను అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. వైద్య సేవలు అందిస్తున్న తీరును స్వయంగా రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జగనన్న పాల వెల్లువ పురుగతిని అడిగి తెలుసుకుని, దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో మందులు, పరికరాలు, నిర్వహణ తదితర అంశాలపై స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఏడుకొండలుకు సూచనలు చేశారు. పశువుల్లో సీజనల్ వ్యాధుల నివారణకు మందులు సిద్ధం చేసుకోవాలన్నారు.

జగనన్న పాల వెల్లువ పురోగతి పెంచాలి

శావల్యాపురం: జగనన్న పాలవెల్లువ కార్యక్రమం సర్వే పురోగతి వేగవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో ప్రభుత్వ పథకాల నిర్వాహణ తీరుపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ పురోగతిపై ఆయా గ్రామాల్లోని వలంటీర్లు సహకారంతో వైఎస్సార్ క్రాంతి పథకం సీసీలు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. స్త్రీనిధి ఏజీయం రంతు చినబుల్లెయ్య మాట్లాడుతూ స్త్రీనిధి రుణాల రీకవరీ నూరు శాతం చేయాలన్నారు.మండలంలో ఇప్పటి వరకు రూ. ఒక కోటి 72 లక్షల రుణాలను మహిళా సభ్యులకు మంజూరు చేశామన్నారు. వినుకొండ క్లస్టర్ సీసీ కృష్ణ మాట్లాడుతూ భవిష్యత్‌లో అన్నీ గ్రూపులు ఎ గ్రేడులో ఉండే విధంగా చూడాలన్నారు. పుస్తక నిర్వాహణ క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారి పి.గణేష్ కుమార్. ఏపీయం జి.వాసుబాబు, సీసీలు గొట్టం రమాదేవి, ఖాజావలీ, బేబిరాణి, యానిమేటర్లు, గ్రామసమాఖ్యా మహిళా సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కలిగి ఉంటే చర్యలు తప్పవు

సెబ్ ఎస్ఐ జయరాం

గురజాల : అక్రమ మద్యం కలిగి వుంటే అట్టి వారిపై చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ ఆఫ బ్యూరో ఎస్ఐ జయరాం అన్నారు. స్థానిక సెబ్ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెంటచింతల మండలంలోని తుమృకోట గ్రామం వద్ద బుధవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తెలంగాణ మద్యం తరలిస్తున్న కొత్త గంగరాజుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల వద్ద 81 బాటిళ్లు తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. అదే విధంగా గురువారం సాయంత్రం దాచేపల్లి మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది శ్రీనివాసరావు, మరియదాసు, సుదర్శన్ తేజ తదితరులున్నారు.

సేవకులు మాదిరిగా జీవించాలి

మాచర్ల: పట్టణంలోని దైవ సేవకులు, విశ్వాసులకు సమాజానికి మేలు చేసే విధంగా ప్రతి ఒక్కరూ ఏసుప్రభువును స్తుతించాలని జగన్ మోహన్‌రావు అన్నారు. గురువారం దైవ సేవకుల వార్షికోత్సవం సందర్భంగా బుగ్గవాగు కాలనీ, పాస్టర్ ఏలియాజరు ఆధ్వర్యంలో ఐపిసి చర్చిలో ఘనంగా నిర్వహించారు. బిషప్ దేవభిక్షం సేవా భావాలు పంచుకున్నారు. కార్యదర్శి మోహన్‌బాబు వార్షిక నివేదికను చదివి వినిపించారు. ప్రసాద్ 2024కు గాను పలు ప్రతిపాదనలు చేశారు. కార్యక్రమ అధ్యక్షుడుగా బ్రహ్మనాయుడు వ్యవహరించగా, సంఘం అధ్యక్షుడు జాన్‌వెస్లీ, ఉపాధ్యక్షుడు ఎలీషా, కార్యనిర్వాహక సభ్యులు యెహోషువా, డేవిడ్‌రాజు, సుందరరావుతో పాటు పలువురు పాస్టర్లు సేవకులు పాల్గొన్నారు.

కొనకంచివారిపాలెంలో ప్రతిష్టా కార్యక్రమాలు



ప్రతిష్టా మహోత్సవానికి బయలు దేరిన భక్తులు

రొంపిచర్ల: కొనకంచివారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ గోవిందాంబ సమేత శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి పరివార దేవతా ప్రతిష్టామహోత్సవం కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, వాస్తు హోమం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రణయణం, హారతి, ప్రధాన దేవతా శాంతి కుంభఆసాధన, ధ్యానపూర్వక కళావాహనం, లఘుపూర్ణాహుతి హారతి, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు నారాయణం వెంకట హనుమంతాచార్యుల ఆధ్వర్యంలో పలువురు రుత్విక్‌లు పాల్గొని పూజా, హోమాలు చేశారు.

మైనర్ బాలిక అదృశ్యం

నరసరావుపేట టౌన్: మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్ కుమార్ గురువారం తెలిపారు. ఫిరంగిపురం మండల పరిధి గ్రామానికి చెందిన బాలిక నరసరావుపేట పట్టణంలోని ఇంటర్ ద్వితీయ సంవత్సం చదువుతోంది. బుధవారం ఇంటి నుంచి కళాశాలకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సిరిసంపదలిచ్చే మాసం శ్రావణం

- సెప్టెంబర్ 15 వరకు విశేష పూజలు, వ్రతాలు, పండుగలు
- తెలుగింట మోగనున్న భాజాభజంత్రీలు



పూజలకు ముస్తాబైన లక్ష్మీదేవి అమ్మవారు



కల్యాణ వేడుకల్లోని ఓ ఘట్టం

యడ్లపాడు: సకల శుభాలకు నిలయమైన శ్రావణ మాసం వచ్చేసింది. ఈ మాసంలో తొలకరి చిరుజల్లులతో వర్షాకాలం ప్రారంభమై ఎండిన చెట్ల కొమ్మలు సైతం తిరిగి చిగురిస్తాయి. బుధవారం వచ్చిన అమావాస్యతో ఆషాఢమాసం ముగిసి శ్రావణం ప్రారంభమైంది. నిజ శ్రావణమాసం గురువారం నుంచి మొదలై సెప్టెంబర్ 15 వరకు ఉంటుంది. సనాతన ధర్మశాస్త్ర ప్రకారం తెలుగు వారు అనుసరించే 12 మాసాల్లో ఐదవది శ్రావణమాసం. ఈనెలలో పౌర్ణమినాడు చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడంతో ఈ మాసానికి శ్రావణం అనే పేరొచ్చింది.

శ్రావణ శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు

శ్రావణం శుభకరమని, సిరిసంపదలను ఒసగే పర్వదినాలను మోసుకొచ్చే ఈ పవిత్ర మాసం కోసం అందరూ ఎదురు చూస్తుండడం పరిపాటి. ప్రధానంగా ఈ నెలలో వచ్చే శుక్రవారం నాడు మహిళలు అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేస్తారు. కుటుంబమంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ లక్ష్మీ పూజలు ఘనంగా నిర్వహిస్తారు.

ఆలయాలు సిద్ధం...

శ్రావణమాసం సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా పలు అమ్మవారి ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో సిద్ధం చేస్తున్నారు. కొన్ని ప్రధాన అలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేయనున్నారు. ఈనెలలో 18,25 తేదీలు, సెప్టెంబర్ నెలలోని 1,8,15 తేదీల్లో వచ్చే శుక్రవారాలలో మహిళల సామూహిక వరలక్ష్మీ పూజలు నిర్వహణకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రధాన ఆలయాలు సిద్ధం చేస్తున్నారు.

సుమూహూర్తాలు షురూ

శుభకార్యాలను పూర్తిగా దూరం పెట్టిన ఆషాఢం..ఆపైన వచ్చిన అధిక శ్రావణమాసం ముగిసి గురువారం నుంచి నిజశ్రావణం ప్రారంభమైంది. గత రెండు నెలలుగా పెళ్లిళ్లకు ముహూర్తాలు లేక వధూవరుల తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులకు శ్రావణం చెక్ పెట్టనుంది. ఈనెల 19 నుంచి డిసెంబర్ వరకు వరుస ముహూర్తాలు ఉండటంతో పెళ్లి సందడి మొదలైంది. ఈనెల 19 నుంచి దాదాపు పది రోజుల పాటు వరుసగా వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఇవి సెప్టెంబరు 10 వరకు కొనసాగి మళ్లీ అక్టోబరు 18 నుంచి ఆరంభమై డిసెంబరు నెలాఖరు వరకు కొనసాగనున్నాయి. పెళ్లిబాజాలు మోగుతుండటంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరికో ఉపాధి లభించనుంది.

ముఖ్యపండుగలు ఈనెలలోనే...

ఈ మాసంలో వివాహ శుభ ముహూర్తాలతో పాటు పలు రానున్నాయి. ఈనెల 21న నాగుల చవితి, గరుడ పంచమి రాకతో ప్రధాన పండుగలు ఆరంభం కానున్నాయి. 22న మంగళగౌరీ వ్రతాలు, 25న వరలక్ష్మీ వ్రతం, 31న రాఖీ పూర్ణిమ, ఈనెల చివరిలో 31 నుంచి మూడు రోజులు రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు, సెప్టెంబర్ 6న శ్రీకృష్ణాష్టమి, 14న పొలాల అమావాస్యతో నిజశ్రావణంలో వచ్చే పండుగలు ముగిసి భాద్రపదంలో ప్రవేశిస్తాయి.

పవిత్రం..శుభప్రదం...



మహాలక్ష్మీ అమ్మవారికి ఇష్టమైన మాసం ఇది. విష్ణుమూర్తి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం ఇదే మాసంలో రావడంతో ఇరువురికి ప్రీతికరమైన మాసం ఇది. అందుకే ఎంతో పవిత్రమైనది, శుభకరమైనది. ఈ మాసంలో జరుపుకునే ముఖ్యమైన పండుగలు ఆనందోత్సాహాన్ని ఇస్తాయి. అలాగే బంధాలు, బాంధవ్యాలను పెంపొందిస్తాయి.

–పర్చూరి రాఘవేంద్ర, పండితులు, చెంఘీజ్‌ఖాన్‌పేట

మంచి ముహూర్తాలు



ఈ మాసం ఆధ్యాత్మికంతో పాటు పర్వదినాలు, శుభకార్యాలకు నిలయం. ఏప్రిల్ నెల నుంచి శుభకార్యాలు లేవు. జులై ఆషాఢమాసం రావడంతో పెళ్లిళ్లకు బ్రేక్ పడింది. ఆగస్టు నెలలో 19, 20, 22, 24, 26, 29, 30, 31, సెప్టెంబర్ 1, 2, 3, 7, 8 తేదీల్లో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. పకృతి పరంగానూ శ్రావణ మాసం ఎంతో ఉపయోగం.

–స్వర్ణ రమణకుమార్, అర్చకులు బోయపాలెం

సమష్టిగా మండల అభివృద్ధికి కృషి చేద్దాం

ఎంపీపీ జయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయశ్రీ

దాచేపల్లి : అభివృద్ధిలో ప్రగతి పథంలో పయనిస్తున్నామని ఎంపీపీ కటకం జయశ్రీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ జయశ్రీ అధ్యక్షతన గురువారం జరిగింది. మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. వర్షాకాలంలో అంటురోగాలు, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శులకు, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రారంభించిన అభివృద్ధి పనులు సకాంలో పూర్తి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో మండలం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.14.68 కోట్ల నిధులతో 10 గ్రామాల్లో పైపులైన్ పనులు ప్రారంభమైయ్యాయని, ప్రతి ఇంటికి సురక్షితమైన తాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని ఆమె అన్నారు. ప్రభుత్వం, పంచాయతీ, మండల పరిషత్ నిధుల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టి పూర్తి చేయాలని, పనుల నిర్వాహణలో పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ జయశ్రీ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సమర్ధవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి నిరుపేదకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జెడ్పీటీసీ మూలగొండ్ల కృష్ణకుమారి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ..గ్రామ వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులను సమన్వయం చేస్తూ మండల పరిషత్ అధికారులు పనిచేయాలని, ప్రభుత్వం చేస్తున్న మంచి ప్రజలకు చేరితే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, సమయపాలనా పాటించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారులుగా అవార్డులు పొందిన సీఐ ఎ. సురేంద్రబాబు, ఏఓ డి. పాపకుమారిని అభినందించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, సొసైటి అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, ఎంపీడీవో శోభారాణి, డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతు మృతి



మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో నర్సిరెడ్డి మృతదేహాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: చేసిన అప్పులు తీర్చలేక మనస్థాపానికి గురైఓ కౌలు రైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన దేవిరెడ్డి నర్సిరెడ్డి (37) గత రెండేళ్లుగా తన కున్న రెండు యకరాలతో పాటు 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంటను సాగు చేశాడు. గత ఏడాది పంటలు పండక రూ. 10 లక్షలు అప్పులపాలయ్యాడు. ఈ ఏడాది ఇప్పటి వరకు వర్షం పడకపోవడంతో కౌలుకు తీసుకున్న పొలంలో పంటలు వేయలేదు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక ఇంట్లో ఉన్న పురుగుమందును పొలానికి తీసుకెళ్లి తాగి ఇంటికి వచ్చాడు. కొద్దిసేపటి తరువాత వాంతులు అవుతుండడంతో ఇంట్లో వారికి పురుగుమందు వాసన వచ్చింది. దగ్గరికి వచ్చి చూసే సరికే పురుగుమందు తాగినట్లు చెప్పాడు. దీంతో నర్సిరెడ్డిని హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న మాచర్ల ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి నర్సిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను వివరాలడిగి తెలుసుకుని ఓదార్చారు. పీఆర్కే వెంట మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, సర్పంచ్ చపారపు లచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ భూమిరెడ్డి రామాంజిరెడ్డిలున్నారు. మృతుని భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు ఎస్ఐ వి శ్రీహరి నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి కుమారుడు రమణారెడ్డి, కుమార్తె ప్రియాంక రెడ్డిలున్నారు.

రీసర్వే పనులపై జేసీ సమీక్ష



రెవిన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

నాదెండ్ల: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష కార్యక్రమంలో భాగంగా రీసర్వే పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రమైన నాదెండ్లలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. రెండో విడతలో మండలంలోని తూబాడు, నాదెండ్ల గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. అనంతరం రెవిన్యూ, సర్వేయర్లు, వీఆర్వోలతో సమావేశమయ్యారు. గ్రామ సర్వేయర్ల లాగిన్‌లో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీఆర్వో లాగిన్‌లో చేర్చిన రెవిన్యూ అంశాలపై మాట్లాడారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్‌పనులు పూర్తయ్యాయని, సర్వే నెంబర్ల ప్రకారం వ్యత్యాసాలు ఉన్నట్లయితే గ్రామ సభల ద్వారా పరిష్కరించాలని ఆదేశించారు. నిర్దేశించిన సమయంలో పక్కా ప్రణాళికతో రీసర్వే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణ, మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, డీటీ అనురాధ, ఆర్ఐ రమీజా, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రీసర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

చిలకలూరిపేటటౌన్: మండలంలోని గోవిందపురం గ్రామ రీసర్వే పనులను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా భూముల హద్దురాళ్ల నాటే ప్రక్రియను పరిశీలించి, సంబంధిత రెవెన్యూ అధికారులతో ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరిత గతిన హద్దురాళ్ల నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి సుజాత, మండల సర్వేయర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో వైఎస్సార్ జలకళ బోర్లు ప్రారంభం



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంలో వైఎస్సార్ జలకళ బోర్లను మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన రైతు గొంగటి శ్రీనివాసరెడ్డి పొలంలో బోర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుకోసం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జలకళ పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఉప్పలపాడు గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 25 బోర్లు మంజూరైనట్లు తెలిపారు. అలాగే మోటార్లకు విద్యుత్ లైన్లు కూడా అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్టెంపూడి ఆదిలక్ష్మీ, ఎంపీటీసీ దూపాటి వెంకటమ్మ, జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సచివాలయం కన్వీనర్ జీనేపల్లి నాగరాజు, లతోపాటు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అచ్చంపేట: బైకును ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన స్థానిక తాళ్లచెరువు మలుపులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లచెరువు చెందిన బత్తుల శ్రీనివాసరావు(40) అచ్చంపేటలో ఉంటున్న అక్క మల్లెల రమణను బైకుపై స్వగ్రామానికి తీసుకెళుతున్నారు. తాళ్లచెరువు మలుపులోకి వెళ్లేసరికి పెట్రోలు బంకు నుంచి వచ్చే మరో బైకును తప్పించే క్రమంలో శ్రీనివాసరావు ప్రయాణిస్తున్న బైక్‌ను మాదిపాడు వైపు నుంచి వచ్చే ట్రాక్టరు ఢీ కొట్టింది. శ్రీనివాసరావుకు తీవ్ర రక్త స్రావమవడంతో 108 అంబులెన్స్‌లో సత్తెనపల్లి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. అక్క మల్లెల రమణకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. అచ్చంపేట ఎస్ఐ సీహెచ్. మణికృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

40 రేషన్ సంచులు స్వాధీనం

శావల్యాపురం: రేషన్ మాఫీయాపై ఉక్కు పాదం మోపుతామని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ అన్నారు. ప్రకాశం జిల్లా నుంచి వినుకొండకు తరలిస్తున్న రేషన్ వాహనాన్ని పిచికలపాలెం గ్రామ సమీపాన పోలీసులకు అందిన సమాచారంతో వాహన డ్రైవరును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.